క్లుప్తంగా

ఘనంగా దుర్గమ్మ ఊరేగింపులు


మొగల్తూరులో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: దేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అమ్మవారి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని భవానీ కాలనీలోని కనకదుర్గమ్మను గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా ఊరేగించారు. యువకుల నృత్యాలతో పాటు శక్తివేషాలు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని ఊరేగించారు. ఓవైపు వర్షం పడుతున్నా భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్యలపై అప్రమత్తత అవసరం


వైఎస్సార్ కాలనీ వద్ద డ్రెయినేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: వర్షాల కారణంగా పట్టణంలో పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కమిషనర్ వైఎస్సార్ కాలనీ, ఆదర్శకాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. ప్రతిరోజూ డ్రెయినేజీలను బాగు చేయాలని చెప్పారు. దగ్గరుండి డ్రెయినేజీలను శుభ్రం చేయించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ అధికారులు ఉన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన


చేతులు శుభ్రం చేసుకుంటున్న విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ముఖ్యంగా చేతులు శుభ్రంగా ఉండాలని హెచ్ఎం రాయపూడి భవానీప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో చేతులు శుభ్రం ఆరోగ్యం పదిలం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ చేతులు ద్వారానే సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. అందువల్ల ఏ పని చేసినా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం అక్టోబర్ 15న చేతులు శుభ్రత దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. కోవిడ్ వచ్చిన తరువాత చేతులు ఎంత శుభ్రంగా ఉంచుకోవాలో? ప్రజలకు తెలిసిందన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన


సిద్ధాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పల్లె పండుగులో భాగంగా వడలిలో రూ.55 లక్షలు, సిద్ధాంతంలో రూ.30 లక్షల వ్యయంతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆచంట జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, సర్పంచ్‌లు చింతపల్లి గనిరాజు(చంటి), కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఉండవల్లి చిన్ని, ఉప్పలపాటి చంటి తదితరులు పాల్గొన్నారు.

నేడు కాళ్లకూరులో లఘుకల్యాణం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి 07:30కు వార్షిక ఆశ్వయుజ మాస లఘు కల్యాణం (చిన్న కల్యాణం) జరుగుతుందని దేవస్థానం ఈఓ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులందరూ విచ్చేసి స్వామివారి కల్యాణ మహోత్సవాలను తిలకించాలని కోరారు.

రేవులు ఇలా.. స్నానాలు ఎలా?


సిద్ధాంతంలో బురదమయంగా పుష్కర రేవు


సిద్ధాంతంలో కేదారీ ఘాట్‌లోని రేవు దుస్థితి


అధ్వానంగా పిండప్రదాన రేవు

అధ్వానంగా కేదారీ ఘాట్ రేవులు

పెనుగొండ: దక్షిణ కాశీగా పేరున్న సిద్ధాంతం కేదారీఘాట్ రేవులు అధ్వానంగా మారాయి. గోదావరి జిల్లాలో కేదారీఘాట్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ పుణ్యస్థలంగా పేరు ఉన్న పుష్కర్ ఘాట్‌తో పాటు, శ్మశాన వాటిక రేవు ఉంది. గత పుష్కరాలకు రెండు రేవులను అభివృద్ధి చేయడంతో పాటు, పిండ ప్రదాన రేవును నిర్మించారు. కార్తికమాసంలోనూ, ఇతర ప్రాముఖ్యత ఉన్న పండుగలకూ రెండు రేవుల్లో పుణ్య స్నానాలు చేస్తారు. కేదారీఘాట్‌లో కేదారేశ్వరుడు కొలువై ఉండడంతో శ్మశాన వాటికకు విశిష్ట ప్రాధాన్యత ఉంది. దీంతో తణుకు, పెనుమంట్ర, అత్తిలి, తాడేపల్లిగూడెం వంటి ఇతర ప్రాంతాల నుంచి అంత్యక్రియలు నిర్వహించడానికి తరలి వస్తుంటారు. ఇలా ఎంతో ప్రాముఖ్యత ఉన్న పుష్కర రేవులు పూర్తిగా బురదమయంగా మారాయి. ఇటీవల వచ్చిన వరదలతో మూడు రేవులు పూర్తిగా బురదతో నిండిపోయాయి. దీనికి తోడు ఇటీవల నిర్వహించిన గణపతి నిమజ్జనాలతోనూ రేవులన్నీ జిప్సం వ్యర్థాలతో నిండిపోయాయి. కనీసం స్నానాలకు చేయడానికి సైతం అనువుగా లేకపోవడంతో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు, పిండ ప్రదానం చేయడానికి వచ్చే మృతుల బంధువులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

కార్తీక మాసం నాటికైనా...

పవిత్ర కార్తీక మాసం త్వరలో ప్రారంభం కానుంది. ఆ సమయంలో పుణ్య స్నానాలు చేయడానికి రేవుల వద్దకు నిత్యం వందలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. దీంతో పాటు కార్తీక సోమవారం, కార్తీక పౌర్ణమి రోజుల్లో అయితే వేలాది మంది హాజరవుతారు. దీంతో భక్తులు అష్టకష్టాలు పడే పరిస్థితి ఉంది. అడుగు, రెండు అడుగుల మేర బురద పేరుకుపోవడంతో, ఇనుప చువ్వలు సైతం అధికంగా ఉండడంతో గాయాలయ్యే అవకాశం ఎక్కువగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో ప్రాచుర్యం ఉన్న సిద్ధాంతం గోదావరి రేవుల విషయంలో అధికారులు స్పందించి రేవులను శుభ్రపరచాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

పాలకొల్లు అర్బన్: పేదరికాన్ని జయించి భారత దేశానికి రాష్ట్రపతి అయినా కూడా నిరాడంబర జీవితాన్ని గడిపిన మహనీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయసరిత అన్నారు. పాలకొల్లు పట్టణంలో మంగళవారం జయసరితతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అబ్దుల్‌కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వసతి గృహంలో తనిఖీలు

భీమవరం: వసతి గృహాల్లో సౌకర్యాలపై భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి మంగళవారం తనిఖీలు చేశారు. పట్టణంలోని వెంకటేశ్వర బధిరుల పాఠశాల, కాళ్ల మండలం అరుణక్షదయ మనోవికాస కేంద్రం, పోలీస్ బొమ్మ సెంటర్‌లోని బీసీ ప్రభుత్వ బాలుర హాస్టల్, బుధవారం మార్కెట్ వద్ద గల బీసీ ప్రభుత్వ బాలుర వసతి గృహాలను ఆయన సందర్శించారు.


మొగల్తూరులో భారీ వర్షం


మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు


మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆట స్థలంలో నిలిచిన వర్షపు నీరు

మొగల్తూరు: మండలంలో గత రెండు రోజులుగా సుమారు 40.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ముఖ్యంగా కేపీ పాలెం, పేరుపాలెం, కాళీపట్నంలోని పల్లపు ప్రాంతాలతో పాటు మొగల్తూరులోని గొల్లగూడెం, స్టేషన్‌రోడ్డు, కోట రోడ్డులోని ప్రధాన రహదారులలో వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జనసైనికుల గుర్రు



పవన్‌కల్యాణ్ ఫొటో లేకుండా ఉన్న శిలాఫలకం

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఫొటో లేదంటూ జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండుగ పేరుతో ఇప్పటి వరకూ ఆచంట, పెనుగొండ మండలాల్లో అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేశారు. వీటిలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పితాని ఫొటోలు ఉన్నాయని, అయితే పవన్ కల్యాణ్ పేరు మాత్రమే ఉందని జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు. అయితే పేరు మాత్రమే కాదని, ఫొటో సైతం ముద్రించాలంటూ జనసేన నాయకులు అధికారులు తీరుపై తీవ్రంగా మండిపడుతున్నారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే పితానికి విజ్ఞప్తి చేశారు.

ఆరోగ్య రికార్డుల తనిఖీ


అరట్లకట్టలో లో రికార్డులు పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌ఎం టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి రికార్డులను ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా గణాంఖ అధికారి విశ్వేశ్వరప్రసాద్, డీపీహెచ్ఎన్ ఒ.వెంకటరత్నం సూచించారు. మండలంలోని అరట్లకట్ట హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎన్‌హెచ్‌ఎం టాస్క్‌ఫోర్సు టీమ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్ఎంఐఎస్, సీఎస్ఎస్ఎం ఆన్‌లైన్ డేటా పరిశీలించి తప్పులను సరిచేశారు. అలాగే స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిని 30 మంది విద్యార్థినులకు, పాఠశాలకు వెళ్లి ఐదుగురు బాలికలకు, ఐదుగురు గర్భిణులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత ఉన్న వారికి పోషకాహారంతో ఐరన్ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు వారి విధి నిర్వహణలో ఆన్‌లైన్ యాప్‌లు ద్వారా చేసే పనులతో పాటు రిజిస్టర్లు, రికార్డులు కూడా సక్రమంగా మెయింటైన్ చేయాలని సూచించారు. లంకలకోడేరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు శిరీష, మార్త తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'


వెలగలవారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం.

పెనుమంట్ర: మండలంలోని వెలగలవారిపాలెం, మల్లిపూడి గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జోశ్యుల మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంట చిరుపొట్ట దశలో ఉందని, రైతులు చివరిదఫాగా పొటాష్ ఎరువులు ఎకరానికి 20 నుంచి 25 కిలోలు తప్పకుండా వేయాలన్నారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరుజల్లులు పడడం వల్ల బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు, పాము పొడతెగులు వరిపంటపై ఆశించే అవకాశం ఉన్నందున అవసరమైన మేరకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. వెటర్నరీ డాక్టర్ జి.వరలక్ష్మి పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, టీకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెలగల సుగుణవతి, దొంగ మహాలక్ష్మి, వాటర్ డీసీ మాజీ చైర్మన్ వెలగల బులిరామిరెడ్డి, గుడిమెట్ల సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలు అరికట్టాలి


పెనుగొండ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: రెండు నెలలుగా పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలు సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నాయని సీపీఎం పెనుగొండ గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పెనుగొండ తహసీల్దారు జి.అనితకు మారికి అధిక ధరలను అరికట్టాలంటూ వినతి పత్రం సమర్పించారు. మార్కెట్లో వంట నూనెలు, పప్పులు, కూరగాయలు, ఉల్లిపాయలు ధరలు భారంగా మారాయన్నారు. పేదలకు సబ్సిడీపై చౌకడిపోల ద్వారా మార్కెట్ రేట్లు కంటే తగ్గించి అందించాలన్నారు. చౌకడిపోల్లో బియ్యం మాత్రమే ఇస్తున్నారని, కందిపప్పు, చింతపండు, పంచదార వంటి వంట సామగ్రి ఊసే లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, కడలి చందు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఆర్‌యూసీసీ సభ్యుడు కుమార్

పాలకొల్లు సెంట్రల్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలకొల్లు రైల్వేస్టేషన్లో దిగి 80 సంవత్సరాలు పూర్తయ్యిందని రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో అంబేడ్కర్ స్మారకంగా అంబేడ్కర్ సాహితీ వేదిక అధ్యక్షులు కోలాటి పెద్దిరాజు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ 1944 సెప్టెంబర్‌లో బ్రిటిష్ వైస్రాయ్ కౌన్సిల్‌లో కార్మిక శాఖ కార్యదర్శి హోదాలో దక్షిణ భారతదేశం పర్యటనలో భాగంగా పాలకొల్లు పట్టణానికి వచ్చారన్నారు. స్టేషన్ నుంచి ఎడ్లబండిపై అద్దేపల్లి సత్యనారాయణమూర్తి కళాశాల ప్రాంగణానికి చేరుకున్నారన్నారు. దళిత యువకులు విద్యను అభ్యసించాలని లేదా భారత సైన్యంలో చేరాలని పిలుపునిచ్చారన్నారు. ఆయన మాటలతో ఉభయగోదావరి జిల్లాల్లో అనేక మంది యువకులు భారత రక్షణ శాఖల్లో పని చేశారన్నారు.

దళితవాడల్లో పారిశుద్ధ్య సమస్యలు


పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు పంచాయతీ పరిధిలోని దళిత, బహుజన వాడల్లో పారిశుద్ధ్యం లోపించింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. పెదపేట, చినపేట, కోడిదుంప, వెదుళ్లపాలెంలో డ్రెయినేజీ నిర్వహణ సక్రమంగా లేదు. దళితవాడల్లో పంచాయతీ అధికారులు కనీసం ముగ్గు, బ్లీచింగ్ చల్లించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వెదుళ్లపాలెం మురికివాడను తలపిస్తుంది. ఇక్కడ పశుపోషకులు ఎక్కువ. దీంతో పశువుల పెంట ఇళ్ల ముందు పేరుకుపోయి ఉంటుంది. వర్షానికి ఇళ్లలో వాడకం నీరు, పశువుల పెంట ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతూ ఉంటుంది. ఈ ప్రాంతంలో ప్రజలు తరచూ విష జ్వరాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రజకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి


పాలకోడేరులో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మడక రాజు

పాలకోడేరు: ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం పాలకోడేరు మండల కమిటీ సమావేశాన్ని మంగళవారం మోగల్లు గ్రామంలో సంఘ భవనంలో సంఘ అధ్యక్షుడు కొమరపూరి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి మడక రాజు హాజరై మాట్లాడుతూ జిల్లాలో చెరువులపై గ్రామ పెద్దలు పెత్తందారీతనం చేస్తున్నారని, దానికి ప్రభుత్వ అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతున్నారని వాపోయారు. రజక వృత్తిదారులు సంఘం చూస్తూ ఊరుకోదని, జీఓ నంబర్ 343 ప్రకారం ప్రతి గ్రామానికీ ఒక వృత్తి చెరువు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో మహిళలపై అనేక ప్రాంతాలలో దాడులు చేస్తున్నారని, అత్యాచారాలకి ప్రయత్నిస్తున్నారని, అట్రాసిటీ చట్టం మాదిరిగానే రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కమిటీ సభ్యుడు యండమూరి నాగేంద్ర మాట్లాడుతూ వృత్తిదారులు బిడ్డల చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు రాక వృత్తిలోనే మగ్గిపోతున్నారని ప్రభుత్వం వెంటనే రజకులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. 50 ఏళ్ల నిండిన వారికి రూ. 5 వేలు పెన్షన్ ఇచ్చి వృత్తిదారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొడ్డిపట్ల అమ్మారావు, ఉపాధ్యక్షుడు మల్లిపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధమవుతున్న మద్యం దుకాణాలు


భీమవరంలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్న మద్యం దుకాణం

భీమవరం: రాష్ట్రంలో ప్రభుత్వం కొత్త మద్యం విధానం అమలులోనికి తేవడంతో ప్రైవేటు వ్యాపారులు బుధవారం మద్యం షాపుల ప్రారంభానికి సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం అంచెలంచెలుగా మద్య నిషేదంలో భాగంగా ప్రభుత్వమే మద్యం షాపులు ఏర్పాటు చేసి మద్యం దుకాణాలను ఘణనీయంగా తగ్గించడమేగాక మద్యం ధరలను కూడా పెంచింది. దీనితో మద్యం విక్రయాలు తగ్గాయి. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్లీ పాత విధానానికి తెరలేపారు. దుకాణాల ఏర్పాటుకు లాటరీ విధానం ప్రవేశపెట్టి పెద్ద సంఖ్యలో షాపులు ఏర్పాటుకు అవకాశమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 175 షాపులు ఏర్పాటు చేస్తుండగా ఈనెల 16వ తేది నుంచి ప్రైవేటు వ్యాపారులు తమ షాపులను ప్రారంభించనున్నారు. దీనికిగాను ఇప్పటికే విక్రయాలు అధికంగా ఉండే ప్రాంతాలను ఎంపిక చేసుకుని షాపులను ఏర్పాటు చేస్తున్నారు. విశాలమైన గదులతోపాటు కూర్చుని మద్యం సేవించడానికి వీలుగా ఉండే విధంగా షెడ్లు నిర్మించుకోడానికి అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని షాపులను ఏర్పాటు చేస్తున్నారు.

మద్యం షాపులకు దేవుళ్ల పేర్లు

మద్యం షాపుల ప్రారంభానికి, షాపులకు పేర్లు పెట్టడం కోసం వ్యాపారులు ముహూర్తాలకోసం పురోహితుల వద్దకు పరుగులు పెడుతున్నారు. షాపులు దక్కించుకున్న ఎక్కువ మంది వ్యాపారులు తమ షాపులకు దేవుళ్లు, దేవతల పేర్లు పెడుతుండడం విశేషం. బుధవారం చతుర్ధశి కావడంతో మంచిరోజుగా భావించి ముహూర్తాలు పెట్టిస్తున్నారు.

కుళాయిల ద్వారా మురుగునీటి సరఫరా

నరసాపురం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్నిరోజులుగా కుళాయిల నుంచి మురుగునీరు వస్తుంది. 30,31 వార్డులు చినమామిడిపల్లి, స్టేషన్‌పేట ప్రాంతాల్లో క్లోరినేషన్ సవ్యంగా చేయకుండా మంచినీటిని కుళాయిల నుంచి వదులుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అభ్యసన సమస్యలపై అవగాహన


అవగాహనా ర్యాలీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: పట్టణంలోని శ్రీహరిపేటలో ఉన్న భవిత విలీన విద్యా వనరుల కేంద్రం ఆవరణలో పిల్లల్లో అభ్యస్యన సమస్యను గుర్తించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం డి.రమేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల సామర్థ్యాలను పరిశీలించి, సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించాలని చెప్పారు. లోపాలున్న పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా వారిలో అభివృద్ధిని పెంపొందించగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేఖ, శారద తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట రైతుల జాబితా

యలమంచిలి: ఈ ఖరీఫ్ సీజన్లో ఈ పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించామని మండల వ్యవసాయ అధికారి చిండులూరి దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన జాబితాను సరి చూసుకుని ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే గ్రీవెన్స్ ఆప్షన్‌లో మార్పు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. మార్పులు చేయాల్సి వస్తే సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో పీజీ సీట్ల భర్తీకి అడ్మిషన్లు

పాలకొల్లు సెంట్రల్: ఏఎస్ఎన్ఎం కళాశాలలో పీజీ కోర్సుల్లో చేరే విద్యార్థుల కోసం అడ్మిషన్లు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాలలో రాజరాజేశ్వరి మాట్లాడుతూ ఎంఏ (ఎకనామిక్స్), ఎంకామ్, ఎమ్మెస్సీ (ఆక్వా కల్చర్), ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (బోటనీ) పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. 2024లో పీజీ సెట్‌లో ర్యాంకులు సాధించి ఇప్పటి వరకూ అడ్మిషన్ పొందని ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో రావాలన్నారు. 2024 అక్టోబర్ 17 నుంచి 21 వరకూ కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలు కోసం 87907 66521 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. దీనికి సంబంధించిన ఫీజు అక్టోబర్ 22 నుంచి 24 లోపు చెల్లించాలన్నారు. అయితే స్పాట్ అడ్మిషన్ ఆధారంగా జాయిన్ అయిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంటు వర్తించదని స్పష్టం చేశారు.

ఆరేడు, కలిగొట్లలో గ్రామ సభలు

ఉండి: జాతీయ ఉపాధి హామీ పనుల గుర్తింపు, అంచనాల తయారీ కోసం రెండవ దఫా నిర్వహిస్తున్న గ్రామ సభల్లో భాగంగా మంగళవారం మండలంలోని ఆరేడు, కలిగొట్ల గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆరేడులో రూ.16 లక్షల విలువైన 21 పనులు గుర్తించారు. అలాగే కలిగొట్లలో రూ.18 లక్షల విలువైన 26 పనులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా ఆరేడులో సర్పంచ్ కట్రెడ్డి బ్రహ్మానందం అధ్యక్షతన గ్రామ సభలో టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఓమేగారాజు మాట్లాడుతూ రెండో దఫా నిర్వహించే ఈ గ్రామ సభల ద్వారా గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనులకు అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే పంట, మురుగు బోదెలను శుభ్రం చేయడం, హార్టీకల్చర్‌లో పండ్లతోటలు, పశువులు, గొర్రెల పెంపకానికి షెడ్లు నిర్మాణాలు చేపడతామన్నారు.